ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం 21 నవంబరు 2025



ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

చిట్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందుకుతండాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తేమ శాతాన్ని యంత్రం సహాయంతో పరిశీలించారు. తేమ 17 శాతం వచ్చిన ధాన్యానికి బారదాను సంచులు వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి కిరణ్‌కుమార్, డీఎం రాములు, తహసీల్దార్ ఇమామ్‌బాబా షేక్, ఆర్ఐ రవీందర్ ఉన్నారు.



ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి

ప్రత్యేక ప్రణాళిక

ఎంపీ బలరాం నాయక్

ములుగు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి దిశ కమిటీ ద్వారా ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్టు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ దివాకర అధ్యక్షతన గురువారం దిశ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై అధికారులతో ఎంపీ చర్చించారు. గతంలో చేపట్టిన పనులు, పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. మౌలిక సౌకర్యాల కల్పన, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టే పనులపై ప్రతిపాదనలు రూపొందించాలని నిర్ణయించారు. అనంతరం ఏర్పాటు చేసినమీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా విడుదలవుతున్న నిధులతో జిల్లాలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేస్తామన్నారు. విద్య, వైద్యం, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తున్నట్టు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి నివేదిక రూపొందించాలని, దానికి అనుగుణంగా ప్రణాళికలు తయారుచేసి పనులు చేపట్టాలని అన్నారు. జిల్లాలో కోల్డ్ స్టోరేజీ, గోదాం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని, చేపపిల్లల పెంపకంపై 67 సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కావాల్సిన చెక్‌డ్యామ్‌ల ప్రతిపాదనలు పంపించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి 163 జంగాలపల్లి నుంచి పస్రా వరకు ఫోర్‌లైన్లను ప్రారంభించాలని, జలగలంచ, కృష్ణాపురం, టేకులగూడెం బ్రిడ్జిల నిర్మాణం ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. ఉపాధి హామీ పనులను సమర్థంగా అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిలో ఉన్న వివిధ సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రతి గ్రామంలోని సమస్యలపై కచ్చితంగా అవగాహన కలిగి ఉండి ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క సహకారంతో ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతు న్నాయని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలపాలని అన్నారు. సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, దిశ కమిటీ సభ్యుడు మాదాడి పూర్ణచందర్, అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, ఆర్డీవో వెంకటేశ్, డీఎస్పీ రవీందర్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కార్తీక మాసం ముగింపు పూజల్లో భక్తులు

ముగిసిన కార్తీక మాసం

మహదేవపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరాలయం వద్ద భక్తులు గురువారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్తీక మాస ముగింపు రోజు అమావాస్య సందర్భంగా పెద్ద ఎత్తున వచ్చారు. ముందుగా త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. బిల్వ పత్రాలతో పూజలు చేశారు. అలాగే శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మాసం మొత్తం 30 నుంచి 50 లక్షల మంది భక్తులు కాళేశ్వరాలయాన్ని సందర్శించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో వేలానికి పెట్టిన బాలసముద్రంలోని 2.27 ఎకరాల ప్రభుత్వ భూమి ఇదే..

కుడా బలుక్కున్నారు!?

నగరంలో ప్రభుత్వ భూముల వేలంపై వివాదం

- రూ.100కోట్ల విలువైన 2.27 ఎకరాల భూమి వేలానికి 'కుడా' ప్రకటన
- అభ్యంతరాలు, ఆరోపణలతో తాత్కాలికంగా వాయిదా
- గంపగుత్తగా వేలానికి సిద్ధం కావడంపై అనుమానాలు
- అధికార పార్టీ ప్రజాప్రతినిధుల బినామీలకు కట్టబెట్టేందుకేనని ప్రచారం
- ప్లాట్లు చేస్తే ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తుంది కదా.. అని పలువురి వాదన
- కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు కోసమే అంటున్న 'కుడా'
- ఐటీ టవర్, కమర్షియల్ కాంప్లెక్స్‌పై దృష్టి పెట్టాలంటున్న నగరవాసులు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

అభివృద్ధి పనులకు నిధులను సమకూర్చుకునేందుకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ప్రభుత్వ భూముల వేలానికి దిగింది. నగరం నడిబొడ్డున బాలసముద్రంలో ఉన్న 2.27 ఎకరాల భూమిని గంపగుత్తగా అమ్మకానికి పెట్టింది. అయితే ఈ విషయంలో అనేక అనుమానాలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్లాట్లుగా విక్రయించకుండా.. ఏక మొత్తంలో భూమిని వేలం పెట్టడం వెనుక అధికారపార్టీ నేతల హస్తం ఉందనే ప్రచారం జరిగింది. వ్యాపారపరంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకే భూమిని వేలం పెట్టామని అధికారులు పేర్కొంటుండగా, క్రీడామైదానానికి కేటాయించిన భూమిని కుడా ఎలా అమ్ముకుంటారని ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ వివాదాల నేపథ్యంలో తాత్కాలికంగా వేలం వాయిదా వేసినప్పటికీ హాట్‌కేక్ లాంటి భూమిని అమ్మడం కంటే కుడానే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేసి, అద్దెలకు ఇస్తే ఆదాయం వస్తుంది కదా అనే చర్చ జరుగుతోంది.

ఆదాయం కోసం వేలం

ఆదాయం కోసం కుడా ప్రభుత్వ భూములను వెంచర్లుగా చేసి, ప్లాట్లు విక్రయిస్తోంది. నగరంలో ఓ సిటీ, మా సిటీ, యునీ సిటీ పేర్లతో భారీగా ప్లాట్ల వ్యాపారం చేసింది. ఇటీవలకాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవటంతో కుడా ప్లాట్లకు డిమాండ్ లేకుండా పోయింది. 117ఎకరాల్లో ఓ సిటీలో చేసిన ప్లాట్లు అనేకం ఇంకా అమ్ముడు పోవాల్సి ఉంది. పశ్చిమ, దక్షిణ ముఖం గల ప్లాట్లు కొనుగోలుకు ప్రజలు ఆసక్తిచూపక పోవటం ఈ ప్లాట్లు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. ఉనికిచర్ల సమీపంలో కుడా చేసిన వెంచర్‌ను స్పోర్ట్స్ స్కూల్ కోసం స్థల సేకరణ చేస్తున్నారు. ఈ క్రమంలో కుడా ఆదాయం పడిపోవటంతో అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడుతోంది. దీంతో హనుమకొండ నడిబొడ్డున బాలసముద్రంలోని సర్వే నెం.1066/5లో గల 2.27ఎకరాల (12,957గజాల) భూమిని వేలం ద్వారా విక్రయించేందుకు కుడా ఏర్పాట్లు చేసింది. హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌కు అతి సమీపంలో ఉండటంతో దీని ద్వారా సుమారు రూ.100 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనాతో గత అక్టోబరు 22వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. వాణిజ్య, (మిగతా 7లో..)

'మోడికుంట'కు మోక్షం

- ప్రారంభమైన ప్రాజెక్టు సర్వే
- రెండు నెలల్లో మొదలు కానున్న నిర్మాణం!
- సుదీర్ఘకాలం తర్వాత పట్టాలెక్కిన పనులు
- తీరనున్న ఏజెన్సీ ప్రజల నీటి కష్టాలు
- కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా కంపెనీ

వాజేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రజల చిరకాల కల సాకారం కాబోతోంది. మోడికుంట మధ్యతరహా ప్రాజెక్టు నిర్మాణానికి మోక్షం కలగనుంది. అనేక అడ్డంకుల కారణంగా రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పనుల్లో కదలిక రాబోతోంది. ఈ ప్రాజెక్టు పనులకు సంబంధించిన సర్వే ప్రారంభమైంది. కాంట్రాక్టును దక్కించుకున్న కంపెనీ ఈ మేరకు ముందడగు వేసింది. మోడికుంట ప్రాజెక్టు తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని వాజేడు మండలం కృష్ణాపురంలో కొండల నడుమ నిర్మాణం కానుంది. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతానికి తాగు, సాగునీరు అందనుంది. ముఖ్యంగా వాజేడు మండలానికి ప్రయోజనం చేకూరనుంది.

రెండు దశాబ్దాల నిరీక్షణ

జలయజ్ఞంలో భాగంగా 2005లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి మోడికుంట ప్రాజెక్టు నిర్మించాలని సంకల్పించారు. ఇందులో భాగంగా రూ. 124.60 కోట్లు మంజూరు చేశారు. అయితే.. ఇందుకు అటవీ, పర్యావరణ శాఖల అనుమతులు లభించలేదు. దీంతో భూసేకరణ జరగ్గా ప్రాజెక్టు పనులు అటకెక్కాయి. కాంట్రాక్టును దక్కించుకున్న గామన్ ఇండియా కంపెనీ ప్రాజెక్టును మొదలు పెట్టే క్రమంలోనే అటవీ శాఖ మోకాలడ్డు వేసింది. నిర్మాణంలో భాగంగా అటవీ శాఖ కోల్పోయే భూములకు బదులు ప్రభుత్వ (మిగతా 8వ పేజీలో)



మోడికుంట ప్రాజెక్టు నిర్మించే ప్రదేశం(ఫైల్)



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

డబ్బులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- చేతివాటం ప్రదర్శించిన కాంగ్రెస్ నేతలు
- లబ్ధిదారుల జాబితాలో అనర్హులు
- మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ హరీశ్‌రెడ్డి



మాట్లాడుతున్న హరీశ్‌రెడ్డి

కృష్ణకాలనీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతలు డబ్బులు తీసుకొని డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎవరెవరికో కట్టబెట్టారని భూపాలపల్లి మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా చేర్చిన జాబితాలో చాలా మంది అనర్హులు ఉన్నారన్నారి, బీఆర్ఎస్ హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారులను తొలగించారని మండిపడ్డారు. అనర్హుల జాబితాను తాము ఇస్తామని, వాటిని తొలగించే దమ్ముందా? అని సవాల్ (మిగతా 8వ పేజీలో..)

రామప్పను సందర్శించిన విదేశీయులు



రామప్పలో జర్మనీ, యూకే దేశస్థులు

వెంకటాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న ప్రఖ్యాత రామప్ప దేవాలయాన్ని జర్మనీ, యూకేకు చెందిన పర్యాటకులు గురువారం సందర్శించారు. ముందుగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా అర్చకులు ఉమాశంకర్, హరీష్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా శిల్పకళా సంపదను వీక్షించిన విదేశీలయులు ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌ను అడిగి తెలుసుకుని మంత్రముగ్ధులయ్యారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్



అనాథాశ్రమంలో పిల్లలతో సబ్ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డీడబ్ల్యూవో

కాటారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని తిమోతి బాయ్స్ హోం లో స్త్రీ, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీడబ్ల్యూవో మల్లీశ్వరితో కలిసి సబ్ కలెక్టర్ హాజరయ్యారు. బాలలకు జీవనం, అభివృద్ధి, రక్షణ, సమాజంలో భాగస్వామ్య హక్కులు ప్రధానంగా ఉంటాయన్నారు. ఆపద సమయంలో బాలబాలికలు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని, దీంతో వారికి రక్షణ లభిస్తుందని అన్నారు. బాలల హక్కులను కాపాడటానికి జిల్లా స్థాయి విభాగం ఉందని తెలిపారు. వారోత్సవాల సందర్భంగా పిల్లలకు వివిధ రకాల ఆటలను నిర్వహించి బహుమతులు అందించారు. పలువురు పిల్లలు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో రాధిక, సూపర్‌వైజర్ శివరాణి, డీసీపీయూ సామాజిక కార్యకర్త సోషల్‌కుమార్, బాయ్స్ హోం నిర్వహకులు డేవిడ్ మార్క్, హృదయానంద్, అశోక్, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్లపై అనేక అనుమానాలు

- సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలి
- సుమోటోగా విచారణ చేపట్టాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



భూపాలపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

కృష్ణకాలనీ/ములుగు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం చేపడుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై అనేక అనుమానాలు ఉన్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అలాగే సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన బస్సు జాతా ములుగు జిల్లాలోకి ప్రవేశించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మావోయిస్టులను కోర్టుకు సరెండర్ చేయకుండా టెర్రరిస్టుల మాదిరిగా చంపడం సరికాదన్నారు. దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని సుమోటోగా కేసును విచారించాలని కోరారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం నరహంతక పాలన సాగిస్తోందని మండిపడ్డారు. కేంద్రం కార్పొరేట్, పెట్టుబడిదారిశక్తుల కోసమే పనిచేస్తోందని దుయ్యబట్టారు. తప్పుడు విధానాలను ప్రశ్నించే వారిపై అర్బన్ నక్సలైట్లుగా కేంద్ర ప్రభుత్వం ముద్ర వేస్తోందని విమర్శించారు. అలాగే మావోయిస్టులు కూడా పునరాలోచన చేయాలని అన్నారు. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని స్పష్టం చేశారు. మావోయిస్టులు తమమ పంథాను మార్చుకొని కమ్యూనిస్టులతో కలిసి రావాలని కోరారు. భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ములుగులో జరిగిన బస్సు జాతాలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు అమ్జద్ పాషా, మండల కార్యదర్శి ముత్యాల రాజు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి కార్యదర్శులు బండి నర్సయ్య, వాడి నర్సయ్య, బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

కృష్ణకాలనీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జాతీయ రహదారి మోరంచపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో హనుమకొండ వైపు వెళ్తున్న క్రమంలో ఎదురుగా హనుమకొండ నుంచి భూపాలపల్లి వైపు వస్తున్న కారు రోడ్డుపై ఉన్న గుంతలో అదుపుతప్పి బస్సు వెనక భాగంలో ఢీకొంది. దీంతో కారులోని ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.



రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న దయాకర్‌రావు

రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎర్రబెల్లి

పాలకుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య జన్మదినం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఇంటికి వెళ్లి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుభాకాకంక్షలు తెలిపారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ పాలకుర్తి నియోజవర్గం పోరాటాల పురిటిగడ్డపై రామయ్య జన్మించడం గర్వకారణమన్నారు. తెలంగాణ రైతాంగా సాయుధ పోరాటంలో జైలుకు జీవితం కూడా అనుభవించిన పోరాట యోధుడని రామయ్య అని ఎర్రబెల్లి దయాకర్‌రావు గుర్తు చేశారు.

●పాలకుర్తి : చుక్కా రామయ్య జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో పాలకుర్తికి చెందిన ప్రముఖ కవి శంకరమంచి శ్యాంప్రసాద్ సన్మానించారు. ఈ సందర్భంగా సామాజిక స్పృహ, దార్శనికత గల విద్యావేత్త రామయ్య అని అన్నారు. తాను రచించిన ఉద్యమ జీవి చుక్కా రామయ్య అనే గ్రంధాన్ని మాజీ మంత్రి కేటీఆర్‌కు అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అనుముల ఎల్లయ్య, ఆర్తి పరాంకుశం పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంలో శాస్త్రీయత జోడించాలి

వెటర్నరీ యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి



శిబిరంలో మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

లింగాలఘణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత యువకులు, మహిళలు పాడిపశువుల పెంపకం, పాల పదార్థాల తయారీకి శాస్త్రీయతను జోడిస్తే సత్ఫలితాలు సాధించవచ్చని పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి సూచించారు. గురువారం సిరిపురం రైతు వేదికలో పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్శిటీ రాజేంద్రనగర్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రీయ డెయిరీ సాగు, పాల ఉత్పత్తుల విలువ జోడింపు అంశంపై మహిళలకు, యువకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లైవ్‌స్టాక్ ప్రోడక్ట్స్ టెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం శివకుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ సాహిత్యారాణి మాట్లాడుతూ కోవా, కలాకండ్, పనీర్, చన్నా, రసగుల్లా, రసమలై, బసుందీ, మజ్జిగ, లస్సీ, ఫ్లేవర్డ్ మిల్క్, వేడ్రింక్స్ లాంటి వాల్యూ బేస్డ్ ప్రోడక్ట్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ గ్రామీణ మహిళల సాధికారత అనే అంశంపై ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో ఏవో మమత, జీసీవోటీ ఎన్‌జీవో ప్రతినిధి బర్ల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి

భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్



గిరిజనులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

వెంకటాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజనుల విద్యాభివృద్ధికి స్వచ్ఛందసంస్థలు తమవంతుగా కృషి చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కాఫేడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో డాన్‌బాస్కో సహకారంతో 400 మంది నిరుపేద కుటుంబాలకు సమకూర్చిన నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల ప్రజల కోసం స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ప్రభుత్వం నుంచే కాకుండా స్వచ్ఛందసంస్థలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గిరిజన గ్రామాల్లో విద్యార్థుల చదువు కోసం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు కొప్పుల తిరుపతిరావు, తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, నాయకులు మన్నెం సునీల్, కాఫేడ్ స్వచ్ఛందసంస్థ డైరెక్టర్ లూర్థురాజు, సభ్యులు గొంది హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.



కుసుమ వేసిన శ్రీరాముడి రంగవల్లి

ఆకట్టుకున్న రాముడి ముగ్గు

జనగామ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆలయ ప్రాంగణంలో శ్రీరాముడి రంగవల్లి గురువారం ఆకట్టుకుంది. యశ్వంతపూర్‌లో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రుల వారి దేవాలయ ప్రాంగణంలో జనగామకు చెందిన పెద్ది కుసుమ శ్రీరాముడి రంగవల్లి చూపరులను అలరించింది. కార్తీక మాసం ముగింపు సందర్భంగా ముగ్గువేశారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

లింగాలఘణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ కబ్జా చేసి అక్రమంగా పట్టామార్పిడి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గురువారం తహసీల్దార్ కార్యాలయంలో స్థానికులు ఫిర్యాదు చేశారు. కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



నూతనంగా ఎన్నికైన తుడుందెబ్బ కమిటీ నాయకులు

ఆదివాసీ హక్కుల సాధనలో ముందుండాలి

తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్

ఏటూరునాగారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల సాధనలో ఆదివాసీలు ముందుండాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) మండల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా తాటి నీలాద్రి, ఉపాధ్యక్షులుగా కోరం సుధాకర్, తాటి మహేష్, శివకుమార్, పూనం పవన్, కోశాధికారి చాట్ల విజయ్, సలహాదారులుగా కబ్బాక రామన్నలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల పరిరక్షణ, 1/70 చట్టం అమలు, అటవీ హక్కులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సంక్షేమ అవకాశాల సాధన కోసం సమితి బలంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్త కమిటీ సభ్యులు బాధ్యతతో పనిచేసి ఆదివాసీ ప్రజల హక్కుల సాధనలో ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి వట్టం జనార్ధన్, జిల్లా అధ్యక్షుడు చందా మహేష్, ప్రధాన కార్యాదర్శి కాపుల సమ్మయ్య, కోశాధికారి సోలం సురేష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గిరిజన గురుకులాల జోనల్ క్రీడలు



విజేత జట్లకు సర్టిఫికెట్లును అందజేస్తున్న ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్

ఏటూరునాగారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాల గిరిజన గురుకులాల విద్యార్థులకు ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి ట్రైబల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌మీట్ గురువారం ముగిసింది. కొమురంభీం మినీ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన ఈ క్రీడా పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ముగింపు కార్యక్రమానికి ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దబ్బాగట్ల జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు సర్టిఫి కెట్లను అందజేశారు. క్రీడాకారులు ఓటమిని కూడా స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ క్రీడా పోటీల ఫైనల్స్ కబడ్డీలో అండర్-14 విభాగంలో ప్రథమ స్థానంలో భూపాలపల్లి బాలికలు నిలవగా, ములుగు ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-14 బాలురు విభాగంలో కొత్తగూడ ప్రథమ స్థానం, ఏటూరునాగారం ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-17 బాలికల విభాగంలో ములుగు ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో మహబూబాబాద్ నిలిచింది. అండర్-17 బాలుర విభాగంలో ఏటూరునాగారం ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో హనుమకొండలో నిలిచింది.

ఖో-ఖోలో..

అండర్-14 బాలికల విభాగంలో ములుగు ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ స్థానంలో భూపాలపల్లి టీమ్ నిలిచింది.

అండర్-14 బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఏటూరునాగారం, ద్వితీయ స్థానంలో కొత్తగూడ నిలిచింది.

అండర్-17 బాలికల విభాగంలో ప్రథమ స్థానం ములుగు, ద్వితీయ స్థానంలో కొత్తగూడ నిలిచింది.

అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఏటూరునాగారం, ద్వితీయ స్థానంలో కొత్తగూడ నిలిచింది.

టెన్నికాయిట్‌లో..

అండర్-14 బాలికల విభాగంలో భూపాలపల్లి ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో వాజేడు నిలిచింది.

అండర్-17 బాలికల విభాగంలో కొత్తగూడ ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో ములుగు నిలిచింది.

ఈ టోర్నమెంట్‌లో మొత్తం 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ క్రీడల్లో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించిన విజేత జట్ల క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి గిరిజన గురుకులాల క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు.

నాసిరకం చేప పిల్లల పంపిణీ

● తిప్పి పంపించిన మత్స్యశాఖ అధికారులు



ఆత్మకూరు నుంచి తిరిగి వెళ్తున్న చేప పిల్లల లారీలు

ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మత్స్యశాఖ కుటుంబాలను బలోపేతం చేయడం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి చేపడుతున్న చేప పిల్లల పంపిణీలో అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై నాసిరకం చేప పిల్లలను తీసువచ్చారని మత్స్యశాఖ చైర్మన్ గుండెబోయిన భిక్షపతి అన్నారు. గురువారం ఆత్మకూరు మండలంలోని పెద్ద చెరువులో పోసేందుకు తీసుకవచ్చిన లారీలలో ఉన్న చేప పిల్లలు ప్రభుత్వం నిబంధనల ప్రకారం నాలుగు ఇంచుల 8 అంగుళాలు ఉండాలి కానీ.. అధికారులు, కాంట్రాక్టరు కుమ్మక్కై నాసిరకం చిన్న చేప పిల్లలను తీసుకువచ్చారని, వాటిని తిరిగి పంపించామని భిక్షపతి తెలిపారు. అధికారులు వెంటనే నాణ్యమైన చేప పిల్లలను తీసుకువచ్చి చెరువుల్లో పోయాలని, లేకుంటే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామన్నారు.

నర్సింగ్ కోర్సులో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం)లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(నర్సింగ్) కోర్సు శిక్షణ కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ పి. జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 ఏళ్ల శిక్షణకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్ మెమోలు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో డే, రెసిడెన్సియల్ సదుపాయాలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్. 76600 22525/76600 22526 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం గొల్లచర్ల క్రాస్‌రోడ్డు వద్ద గురువారం ఆటోలో తరలిస్తున్న నల్లబెల్లంతో పాటు పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఖాదర్‌పాషా తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ వద్ద నుంచి ఆటోలో కొందరు వ్యక్తులు బెల్లం తరలిస్తున్నారు. అదే సమయంలో గొల్లచర్ల క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై ఖాదర్‌పాషా తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తున్నారు. అటుగా వచ్చిన ఆటో అనుమానస్పదంగా కన్పించడంతో తనిఖీ చేశారు. ఆటోలో 7 బస్తాల బెల్లంతో పాటు ఓ బస్తాలో పటిక ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశారు. ఇందుకు కారకులైన కేసముద్రంనకు చెందిన బాదావత్ సురేష్, మానుకోటకు చెందిన జ్యోతిబసునగర్‌కు చెందిన నిజ్జుతో పాటు ఇనుగుర్తి మండలం కోమటిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ సంతోష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు, టీడీపీ నాయకులు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల జాబితాను రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట టీడీపీ ఆధ్వర్యంలో ధర్నా

భూపాలపల్లిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలో విడుదల చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు ఎస్‌కే సాగర్ మాట్లాడుతూ పదేళ్లుగా పేదలను బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేస్తూనే ఉన్నాయని విమర్శించారు. పేదల సొంతింటి కల నెరవేరడం లేదని అన్నారు. బుధవారం ప్రకటించిన డబుల్ బెడ్‌రూం జాబితాలో అనర్హులు ఉన్నారని, దానిని రద్దు చేసి అర్హులకే ఎంపిక చేయాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు డబుల్ బెడ్‌రూం మంజూరు కాని బాధితులు, టీడీపీ నాయకుడు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై హేమ

చిట్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పోరాటయోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయిని విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సై-2 హేమలత అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకల్లో ఆమె మాట్లాడారు. బాలికలు మానసికగా, శారీరకంగా ధృడంగా ఉండాలన్నారు. క్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. పాఠశాల స్థాయిలోనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని కష్టపడి చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సెల్‌ఫోన్, టీవీ, సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని, చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈసందర్భంగా వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవీందర్, ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ ఇన్‌చార్జి వేల్పుల రాజ్‌కుమార్, నగర కార్యదర్శి అజయ్, నాయకులు సాయి, శశివర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎల్ఎస్ డెంటల్ క్లినిక్ వైద్యుడిపై కేసు

వరంగల్ క్రైం, నవంబరు (ఆంధ్రజ్యోతి): ఎండీఎస్ పట్టా లేకున్నా.. ఉన్నట్లుగా ప్రజలను నమ్మిస్తూ డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్న డాక్టర్ శేషుకుమార్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. బీడీఎస్ పూర్తి చేసిన శేషుకుమార్ కొంతకాలంగా ఎండీఎస్ పూర్తి చేసినట్లుగా పత్రిక ప్రకటనలు ఇస్తూ జీఎల్ఎస్ డెంటల్, ఇంప్లాంట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. దీనిపై ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వరంగల్ వైద్యులు రాష్ట్ర దంత వైద్య మండలి, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారికు ఫిర్యాదు చేశారు. విచారణలో ఎలాంటి ఎండీఎస్ పట్టా లేకుండా ప్రజలను మోసం చేస్తున్నాడని నిర్ధారణ కావడంతో జిల్లా వైద్యాధికారి ఫిర్యాదు మేరకు శేషుకుమార్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేపు కిట్స్‌లో 42వ స్నాతకోత్సవ వేడుకలు

హసన్‌పర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్ ఆవరణలో ఈ నెల 22న శనివారం 42వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు కిట్స్ వరంగల్ గవర్నింగ్ బాడీ చైర్మన్ కెప్టెన్ వి.లక్ష్మీకాంతరావు తెలిపారు. ప్లే ఫీల్డ్ కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో నిర్వహించనున్న గ్రాడ్యుయేషన్ డేలో కరిక్యులమ్ యాక్టివిటీలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన 28 మంది మెరిట్ విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు అకాడమిక్ మెరిట్ అవార్డులు, డిగ్రీలు, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ గ్రాండ్ అంట్స్‌కు అందజేస్తామని తెలిపారు. ముఖ్య అతిథులుగా నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి, గౌరవ అతిథులుగా వరంగల్ కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, కోశాధికారి పి.నారాయనరెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌ను అభినందించిన ఎమ్మెల్యే రేవూరి

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో జల సంరక్షణ కేటగిరి-2లో వరంగల్ జిల్లాకు మొదటి స్థానం దక్కిన నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతోపాటు రూ.1 కోటి దక్కించుకున్న విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ సత్య శారద అవార్డు స్వీకరించిన తరుణంలో గురువారం కలె క్టర్ చాంబర్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో జల సం రక్షణ చర్యలను విజయవంతంగా చేపట్టి రాష్ట్రానికి ప్రతి ష్ట తెచ్చారని ప్రశంసించారు.

ట్రాక్టర్ చోరీ కేసులో ఒకరి అరెస్టు



నిందితుడి అరెస్ట్‌ను చూపిస్తున్న అడిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత నెల ఏటూరునాగారం మండలంలో జరిగిన ట్రాక్టర్, ట్రాలీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. దొంగిలించిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఏటూరునాగారం అడిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ గురువారం వెల్లడించారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు తెలిపారు.

గత నెల అక్టోబరు 13న రాత్రి మండల కేంద్రలోని ఆకులవారిఘణపురం ప్రాంతానికి చెందిన దొడ్డ సాంబయ్య తన ట్రాక్టర్‌ను అమ్మ ఆస్పత్రి పక్కన పార్కు చేయగా, గుర్తు తెలియని వ్యక్తులు దాని ట్రాలీని దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో అడిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ పర్యవేక్షణలో పోలీసులు రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. సీఐ అనుముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సైలు రాజ్‌కుమార్, నరేష్ మండలంలోని ముళ్లకట్ట వంతెన వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌పై వస్తున్న ఒక వ్యక్తి పోలీసులను చూసి వాహనాన్ని పక్కకు ఆపి పారిపోవడానికి ప్రయత్నించగా అనుమానంతో అతడిని వెంబడించి పట్టుకున్నారు. ఆ ట్రాక్టర్‌ను పరిశీలించగా, అది అక్టోబరులో ఏటూరునాగారంలో చోరీకి గురైనదేనని గుర్తించారు.

పట్టుబడిన వ్యక్తి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా భూపాలపట్నం వాసి పుప్పాల సాయి ప్రకాశ్ అని వెల్లడైంది. అతడు ట్రాక్టర్ మెకానిక్‌గా పని చేస్తుంటాడని ఏఎస్పీ తెలిపారు. దొంగతనంలో తన స్నేహితుడు యాలం గణపతి కూడా పాల్గొన్నాడని అతడు ఒప్పుకున్నాడని చెప్పారు. దొంగలించిన ట్రాక్టర్‌ను వరంగల్ తీసుకెళ్లి అమ్ముదామని వెళ్తుండగా పట్టుబడినట్లు అన్నారు. 2024లో చిన్నబోయినపల్లి గ్రామపంచాయతీకి చెందిన మరో ట్రాక్టర్‌ను కూడా తామే దొంగిలించామని, అది ప్రస్తుతం యాలం గణపతి వద్ద ఉందని నిందితుడు చెప్పాడని వెల్లడించారు. కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రాజ్‌కుమార్, నరేష్, హెచ్‌కానిస్టేబుల్ బాబాజీ, కానిస్టేబుల్స్ గోపి, చంద్రమోహన్, హరీశ్‌ను అదనపు ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

సీఎం కృషితో ప్రత్యేక నిధులు

» రూ.18 కోట్ల నిధులతో 6 వంతెనలకు శంకుస్థాపన
» వరంగల్ ఎంపీ కడియం కావ్య


వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కావ్య తదితరులు

తొర్రూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషితో కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. పీఎంజీఎస్‌వై పథకం ద్వారా మంజూరైన నిధులతో గురువారం తొర్రూరు మండలం చెర్లపాలెం, కంఠాయపాలెం గ్రామాల్లోని వంతెనల నిర్మాణాల కోసం స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో కలిసి ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొర్రూరు మండలంలోని 2 ప్యాకేజీల కింద రూ.18 కోట్ల 39 లక్షలతో చెర్లపాలెం, కంఠాయపాలెం, హరిపిరాల, మడిపల్లి గ్రామాల్లో 5 వంతెనలు, పెద్దవంగర మండలంలో ఒక వంతెన నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికలతో కారు షెడ్‌కు వెళ్లిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, యూత్ మండల ప్రెసిడెంట్ పయ్యావుల ప్రవీణ్ యాదవ్, రాజేశ్ యాదవ్, నాయకులు దేవేందర్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, ఎన్నమాల శ్రీనివాస్, వాసురెడ్డి, ముద్దం విక్రమ్‌రెడ్డి, సధాకర్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీటీ నర్సయ్య, ఏఈ నరేష్ రెడ్డి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ కగార్’ను వెంటనే నిలిపివేయాలి

» ఎన్‌కౌంటర్లపై కేసు నమోదు చేయాలి
» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

జనగామ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తోందని, వీటిని న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మావోయిస్టు అగ్ర నేత హిడ్మా లొంగి పోతారని ప్రచారం జరిగినా, హిడ్మా, అతడి భార్య, మరో ఆరుగురు మావోయిస్టులను నిర్బంధించి చంపారని ఆరోపించారు. నిజంగా ఎన్‌కౌంటర్ జరిగితే ఒక్క పోలీసుకూ గాయాలు ఎందుకు కాలేదని ప్రశ్నించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మావోయిస్టులను వచ్చే మార్చి లోపు ఏరి వేస్తామని ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఒక వ్యక్తిని చంపే అధికారం ప్రభుత్వానికి కానీ, పోలీసులకు లేదన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చాక జడ్జి తీర్పు ఇచ్చిన తర్వాతే నేరస్థుడిని శిక్షించాలన్నారు. పోలీసులు నిర్బంధించిన మరికొంత మంది మావోయిస్టుల అగ్ర నాయకులను కోర్టు ముందు హాజరు పర్చాలని డిమాండ్ చేశారు. హిట్లర్‌లాంటి వాళ్లనే మట్టి కరిపించిన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. పార్లమెంట్‌లో బలం ఉందని మేము ఏది చేసినా నడుస్తుందని విర్రవీగిన వారందరూ చరిత్రలో మట్టిలో కలిసిపోయారని పీఎం నరేంద్రమోదీకీ అదే గతి పడుతుందని హెచ్చరించారు.

అవి ప్రభుత్వ హత్యలే..

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. పత్తి కొనుగోలుకు ఆంక్షలు పెట్టి రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కిసాన్ కపాస్ యాప్‌తో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వెంటనే ఆ యాప్‌ను ఎత్తి వేయాలన్నారు. 12 శాతం పైగా తేమ ఉన్నా పత్తిని కొనుగోలు చేయాలని, రంగుమారిన పత్తిని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఆత్మహత్య చేసుకోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.



నారు దశ.. జాగ్రత్తలే రక్ష

» శీతాకాలంలో నారు మడులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
» రాత్రిపూట నీరు తీసి, ఉదయం నింపాలి
» యాజమాన్య పద్ధతులు పాటించాలి

వర్ధన్నపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులు వరి నారు మడ్లు తయారు చేస్తున్నారు. వరి పంట సాగులో భాగంగా నారుమడి తయారు చేయు రైతులు శీతకాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రాత్రి, ఉదయం సమయాల్లో ఉష్ణోగ్రత తీవ్రత పూర్తిగా పడిపోతుంది. అందువల్ల నారు మడిలో నీరును మారుస్తూ నీటి యాజమాన్యం పాటించాలి. దీంతో చలి నుంచి నారుమడిని కాపాడుకోవచ్చు. నారు ఆరోగ్యంగా పెరిగితేనే పంట దిగుబడి అధికంగా వస్తుంది. అందువల్ల నారుమడ్ల యాజమాన్య పద్ధతులు పాటించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎకరానికి 30 నుంచి 35 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండిజమ్‌తో విత్తన శుద్ధిచేయాలి. దీంతో విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లను అరికట్టవచ్చు. నిద్రావ్యవస్థలో ఉన్న విత్తనాలను మేలుకొల్పడానికి 1 కిలో విత్తనానికి 10మిల్లీ లీటర్ల నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టాలి. పశువుల పేడ గాని, సేంద్రియ ఎరువును ఎకర నారుమడికి 100 నుంచి 200 కిలోల నత్రజనిని, కిలో పోటాషియంను చల్లాలి. విత్త నాలు విత్తిన 15 రోజులకు 2 కిలోల భాస్వరం వేసుకోవాలి.

మండలంలో నారుమడ్ల తయారీలో ఉన్న రైతులకు ఈ శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

నారు మడి తయారీ

రెండు గుంటల నారుమడికి 2 క్వింటాళ్ల కోళ్ల ఎరువు లేదా గొర్రెల ఎరువు లేదా వర్మీ కంపోస్టును వేసి కలియదున్నాలి. ఈ సేంద్రియ ఎరువులను నారుమడుల్లో వాడటం వల్ల చలి తీవ్రతలో కూడా నారుకు పోషకాలు అంది ఎదగుదలకు తోడ్పడుతుంది. లేదంటే రెండు గుంటల నారుమడికి 2కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 1కిలో పొటాష్‌ను వేయాలి.

యాసంగిలో వరి పంట వేయాలనుకునే రైతులు స్వల్పకాలిక రకాలను ఎంచుకోవడం ఉత్తమం. ఎందుకంటే నీటి లభ్యత పంట కాలం ఎక్కువైతే సమస్యలు ఎదురవుతాయి. అదే విధంగా వడగండ్లు, తదితర విపత్తులు సంభవించే అవకాశం ఉంటుంది.

చలితో జింక్ లోపం

చలి అధికమైనప్పుడు జింక్ లోపం వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల నారుమడిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌కు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొలకట్టిన విత్తనాన్ని నారుమడిలో మొదటి వారం రోజుల పాటుగా తక్కువగా ఉంచాలి. రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు కంటే తక్కువగా ఉన్నప్పుడు నారు ఎదుగదు. కొన్ని సార్లు వరి చనిపోతుంది. దీని కోసం రసాయన ఎరువులను వినియోగించాలి. చలి సమస్యను అధిగమించడానికి వరిమడ్లపై టార్పాలిన్‌లు రాత్రి పూట ఉంచి, ఉదయం పూట తీసి వేయాలి. రాత్రి పూట వరి మడి నుంచి పూర్తిగా నీరు తీసివేసి, ఉదయం పూట తాజా నీటిని నింపాలి. దీంతో వరి ఎదుగుదలలో లోపం లేకుండా ఉంటుంది. కాండం తొలిచే పురుగు (మొగ్గ పురుగు) నుంచి పంటను కాపాడుకోవడానికి నారు తలలు తుంచి నాటు వేసుకోవాలి. దీంతో కాండం తొలిచే పురుగు నారు కొనలపై గుడ్లు పోదుగుతుంది. దిని వల్ల గుడ్లతో పాటుగా మొగ్గపురుగును నివారించవచ్చును. నారు తీసే వారం రోజుల ముందు ఎకరా నారుమడికి 1 కిలో కార్బోఫ్యూరో గ్రీజ్ లేదా కార్టప్ హైడ్రో క్లోరైడ్ పోర్‌జీ గుళికలను వేసేకున్నట్లయితే నాటు వేసిన నెల రోజుల వరకు ఎలాంటి కీటకాలు ఆశించకుండా పంటను రక్షించుకోవచ్చు.

అధికారుల సలహాలు పాటించాలి
విజయ్‌కుమార్, ఏవో

ప్రస్తుతం ఉన్న వాతావరణం పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నారుమడుల్లో సాయంత్రం వేసిన నీటిని ఉదయం తొలగించాలి. చలి తీవ్రత నుంచి నారుమడిని కాపాడుకోవడానికి వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటే మంచింది. నారుమడికి కావాల్సిన వెచ్చదనం అందించే ఎరువులను వాడుకుంటే ఫలితం.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

బీసీ రిజర్వేషన్లపై
బీజేపీ, బీఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి లేదు

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆరోపించారు. గురువారం వరంగల్‌లోని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ నివాసంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు నియోజకవర్గం నుంచి పూర్తి మద్దతు తెలుపుతూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. యువ నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న సందర్భంగా బడుగు బలహీన వర్గాలను కలిసినప్పుడు రాజకీయంగా, ఆర్థికంగా అట్టడుగున ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. వారికి న్యాయం జరగాలంటే బీసీలకు జనాభా పరంగా రావాల్సిన వాటా వచ్చినప్పుడే వారు అభివృద్ధి చెందుతారనే అభిప్రాయానికి వచ్చారని అన్నారు. దీంతో బీసీకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కేటాయించి అమలు చేయాలని సంకల్పించారని తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి రెడ్డి కులానికి చెందిన వారైనప్పటికీ కులగణన చేపట్టి జనాభా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని నిశ్చయించారని సారయ్య అన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో శాసనసభలో, శాసన మండలిలో చర్చ చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపించారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మాత్రం బీసీ రిజర్వేషన్లకు సహకరించడం లేదని చెప్పారు. ఇప్పటికీ బీసీలలో కొన్ని కులాల వారు కనీసం వార్డు సభ్యుడిగా కూడా ఎన్నిక కాని పరిస్థితి నెలకొందన్నారు.

కార్పొరేటర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్లపై నోటితో రిజర్వేషన్లు కావాలే.. నొసటితో రిజర్వేషన్లు అక్కరలేదన్నట్లు బీజేపీ వ్యవహరిస్తుందన్నారు. ఇది ద్వంద్వ వైఖరి అన్నారు. సమావేశంలో నాయకులు బస్వరాజు శ్రీమాన్, గోరంటాల రాజు, కరాటే ప్రభాకర్, బిల్ల శ్రీకాంత్, దూపం సంపత్, కూరతోట సదానందం, బొలుగొడ్డు శ్రీను, రాముల బాబు, భైరబోయిన చంద్ర మౌళి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం తగదు

పీఏసీఎస్ అధికారులపై కలెక్టర్ స్నేహ శబరీష్ ఫైర్


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పీఏసీఎస్ అధికారులపై హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని జయగిరి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో నిర్వాహకులు, అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎంత మంది రైతుల వద్ద ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధిత నిర్వాహకులు ఇప్పటి వరకు 29 మంది రైతుల వద్ద 1032.20 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీరిలో ఎంతమందికి పేమెంట్ అయ్యిందని కలెక్టర్ అధికారులను ప్రశ్నించడంతో పాటు, ఇప్పటి వరకు 29 మంది రైతులకు సంబంధించిన పేమెంట్ ఎందుకు జనరేట్ చేయలేదని, ట్రక్ షీట్‌లో మాయిశ్చర్ నమోదు చేయకుండా ఎందుకు మిల్లులకు తరలిస్తున్నారని మండిపడ్డారు.

ఆన్‌లైన్ సమస్య ఉందని చెప్పడంతో కలెక్టర్ మరింత సీరియస్ అయ్యారు. ట్రక్ షీట్‌తో పాటు మాయిశ్చర్ నమోదు చేయకుండా ఆన్‌లైన్ పేమెంట్ చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డితో పాటు వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడే ఉన్న మహిళా రైతు అరుణ పేమెంట్‌ను కలెక్టర్ స్వయంగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలులో నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తే టోల్ ఫ్రీ నెంబర్‌కు గానీ లేదా స్వయంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెంట ఏడీఏ ఆదిరెడ్డి, తహసీల్దారు పూజారి కిరణ్‌కుమార్, ఎండీవో సుమనవాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్, ఏఈవోలు సుమన్, భాస్కర్, పీఏసీఎస్ హసన్‌పర్తి సీఈవో శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లయీస్ అధికారులు, మార్కెట్ డైరెక్టర్ పల్లె దయాకర్ రైతులు పాల్గొన్నారు.

‘కుడా’బలుక్కున్నారు!?

(5వ పేజీ తరువాయి)

షాపింగ్ మాల్స్, హోటల్స్, హస్పిటల్స్ విద్యా సంస్థలకు, ఐటీ కంపెనీ కార్యాలయాలకు అనుగుణంగా ఉంటుందని, ఏక మొత్తంలో 2.27ఎకరాల భూమిని వేలం పెట్టింది. తొలుత నవంబరు 3వ తేదీన ఆక్షన్ తేదీని ప్రకటించింది. అయితే నగరంలో వరదలు రావటంతో 14వ తేదీకి వాయిదా వేశారు. హాట్‌కేక్‌లాంటి భూమిని గంపగుత్తగా అమ్మకానికి పెట్టడంపై విమర్శలు రావటంతో పాటు క్రీడా స్థలాన్ని ఎలా విక్రయిస్తారని టీడీపీతో పాటు కమ్యూనిస్టు పార్టీలు అభ్యంతరం చెప్పటంతో వేలం తాత్కాలికంగా వాయిదా వేశారు.

హస్తం నేతల నజర్ ?

నగరంలో వివిధ అభివృద్ధి పనులకు, నిర్మాణాలకు స్థలం కొరత ఉంది. అనువైన స్థలం లేకపోవటంతో నగరానికి దూరంగా నిర్మాణాలు చేయాల్సి వస్తోంది. అయితే ఉమ్మడి జిల్లా ప్రజలు వినియోగించుకునే హనుమకొండ బస్టాండ్‌తో పాటు స్టేడియానికి అతి సమీపంలో ఉన్న ఈ భూమి వేలంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2.27ఎకరాల భూమిని ఏక మొత్తంలో వేలం వేయటం దేనికనే ప్రశ్నలు వస్తున్నాయి. వెంచర్ చేస్తే 50 వరకు ప్లాట్లు వస్తాయని, దీనితో ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పట్టణ నడిబొడ్డున మరో కాలనీ ఏర్పడుతుందనే వాదన ఉంది. అలా కాకుండా ఏకమొత్తంలో 2.27ఎకరాల భూమిని వ్యాపారవర్గాల కోసం వేలం వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ వేలం వెనుక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల బినామీల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ప్రజాప్రతినిధి తన బినామీ కంపెనీకి కట్టబెట్టేందుకు వేలం వేయిస్తున్నారనే చర్చ జరుగుతోంది.

మరోవైపు ఈ భూమిని క్రీడామైదానం, క్రీడల అభివృద్ధి కోసం గతంలో ప్రణయ్‌భాస్కర్ మంత్రిగా ఉన్నప్పుడు 3వేల గజాల స్థలాన్ని కేటాయించారని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. బాలసముద్రం భూముల వేలాన్ని నిలిపివేయాలని కుడా కార్యాలయం ఎదుట టీడీపీ నేతలు ధర్నా నిర్వహించి, చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్‌కి వినతి పత్రాన్ని అందించారు. బీఆర్‌ఎస్‌తో పాటు కమ్యూనిస్టులు కూడా బాలసముద్రం భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీంతో భూముల అమ్మకం తాత్కాలికంగా వాయిదా వేశారు.

అయితే ఈ విమర్శలను అధికార పార్టీ నేతలు, కుడా అధికారులు మాత్రం తిప్పికొడుతున్నారు. నగరం వ్యాపారంగా అభివృద్ధి చేసేందుకే వేలం వేస్తున్నట్లుగా చెపుతున్నారు. 2.27ఎకరాల భూమి ఒకే కంపెనీకి దక్కితే.. ఏదైనా షాపింగ్ మాల్, ఐటీ కంపెనీ లేదా విద్యాసంస్థలు వచ్చే అవకాశం ఉంటుందని, ఆ ఉద్దేశంతోనే ఏకమొత్తంలో భూమిని వేలం వేస్తున్నామని చెపుతున్నారు. ప్లాట్లుగా విభజిస్తే చాలా వరకు భూమిని కోల్పోవాల్సి వస్తుందంటున్నారు. పక్కనే నాలా ఉండటం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఇతరత్రా అవాంతరాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. కమర్షియల్ స్థలం కావటంతోనే ఏకమొత్తంగా భూమిని వేలం వేస్తున్నామని అంటున్నారు.

కమర్షియల్ కాంప్లెక్స్.. ఐటీ టవర్..

హైదరాబాద్ తరువాత రెండో రాజధానిగా ప్రభుత్వం వరంగల్‌ను అభివృద్ధి చేస్తోంది. నగరం నడిబొడ్డున ఉన్న స్థలాన్ని అమ్మకానికి పెట్టే బదులు కుడా నిధులతో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తే.. అద్దె ద్వారా ఆదాయం వస్తుందనే వాదన వినిపిస్తోంది. అడ్వాన్స్‌లు, అద్దెలతో భూమిని విక్రయించిన దానికంటే అధికంగా ఆదాయం వస్తుందనే చర్చ జరుగుతోంది. ఇది సాధ్యం కాకుంటే ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న నగరంలో ఐటీ అభివృద్ధి కావటం లేదు. దీంతో ఈ స్థలంలో ఐటీ టవర్ నిర్మాణం చేస్తే కొన్ని కంపెనీలు వచ్చే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. నగర శివారులో ఉన్న మడికొండలో ఐటీ అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతున్నాయనే ప్రచారం ఉంది. ఇప్పటికే రైల్వేలైన్ ఉండటంతో పాటుగా ఎయిర్ పోర్టు కూడా వస్తుండటంతో వరంగల్‌లో ఐటీ అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో హాట్‌కేక్ లాంటి బాలసముద్రం భూములను నగర అభివృద్ధికి, వ్యాపారాభివృద్ధికి వినియోగిస్తే బాగుంటుందని అంటున్నారు.

బెంబేలెత్తిస్తున్న చలి

• శీతల గాలులతో జనం ఉక్కిరిబిక్కిరి
• అలసత్వం వహిస్తే పొంచి ఉన్న ప్రమాదం



వరంగల్ మెడికల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చలి రోజు రోజుకూ పెరుగుతోంది. రాత్రి పూట విపరీతంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. నాలుగు రోజుల నుంచి పగటిపూట కూడా అత్యల్పంగా 20 నుంచి 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వచ్చే రోజుల్లో గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున వాతావరణ మార్పుల నేపథ్యంలో వైరల్ వ్యాధులు మరింత పెరిగే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. జలుబు, జ్వరం, దగ్గు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అస్తమా, సీవోపీడీ వంటి సమస్యలతో బాధపడేవారు మరిన్ని జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి తీవ్రత పెరుగుతున్న క్రమంలో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు పేర్కొంటున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు జబ్బుల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్యులు తెలుపుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

మూడు పూటల వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని చెబుతున్నారు. చలికాలంలో ఆహారం, నీటితో అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదముందని, అందుకే కాచి చల్లార్చిన గోరువెచ్చని నీటిని తాగాలని సూచిస్తున్నారు. పొగ మంచు కారణంగా శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ఎండ వచ్చాకే వాకింగ్ చేయడం మంచిదంటున్నారు. చలి తీవ్రత ఎక్కువైనందున పిల్లలు, పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చలితో చర్మం, ఊపిరితిత్తుల సమస్యలతోపాటు గుండె సంబంధ వ్యాధుల వారికి డిప్రెషన్ పెరిగే అవకాశముందని తెలుపుతున్నారు. శీతకాలంలో ఊపిరితిత్తుల సమస్యలు వస్తే న్యూమోనియా, ఇన్ఫ్యూంజాగా పరిగణిస్తారు.

వేడి ఆహారం తీసుకోవాలి



చలి తీవ్రత బాగా ఉన్నందున పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి. వేడి ఆహారాన్నే తీసుకోవాలి. అస్తమా పేషెంట్లు జాగ్రత్తగా ఉండాలి. ఉదయం 10 గంటల వరకు బయటకు రాకూడదు. కూల్‌డ్రింగ్స్, ఐస్‌క్రీంలు, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండాలి. మాంసాహారం ఎక్కువ తీసుకోవచ్చు. రూమ్ హీటర్స్ వాడాలి. బయటకు వెళ్లేప్పుడు ఉన్ని దుస్తులు ధరించాలి.

దుర్గం వెంకటేశ్, ఫిజిషియన్, ఎంజీఎం ఆస్పత్రి

చర్మ వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి



చర్మ వ్యాధిగ్రస్తులు చలికాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. సన్‌స్క్రీన్ లోషన్లు వాడాలి. చలికాలంలో చర్మం పొడిబారుతుంది. ఈ లోషన్‌తో సమస్యల పరిష్కారమవుతుంది. స్నానానికి ఒక బకెట్ గోరువెచ్చని నీటిని వాడాలి. దీనివల్ల చర్మం కాంతివంతంగా ఉంటుంది. పెదవులకు లిప్‌బామ్‌లు వాడాలి. ఎక్కువగా విటమిన్ సీ, ఈ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి. రోజువారిగా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా కనీసం మూడు లీటర్ల నీటిని తీసుకోవాలి. స్వెటర్, ఉన్ని దుస్తులు ధరించాలి.

సాతు శ్రీకాంత్, చర్మ వైద్య నిపుణుడు, కాకాజీ కాలనీ

పురుగుల అన్నం పెడుతున్నారు..

» కల్వల ఆదర్శ పాఠశాల విద్యార్థినుల ఆరోపణ » వసతిగృహం వద్ద బైఠాయింపు


ఆదర్శ వసతిగృహం ఎదుట బైఠాయించిన విద్యార్థినులు

కేసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహంలో గురువారం పురుగులు ఉన్న కిచిడీ పెట్టడంతో విద్యార్థినులు వసతిగృహం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ హాస్టల్‌లో కేర్ టేకర్, వంట మనుషుల మధ్య సమన్వయం లేక సరైన సమయానికి అల్పాహారం, భోజనం వడ్డించడం లేదని తెలిపారు. ఉదయం 9 గంటలకే పాఠశాలకు వెళ్లాల్సి ఉండగా 9.30కు అల్పాహారం తయారు చేస్తున్నారని దీంతో తాము టిఫిన్ చేయకుండానే స్కూల్‌కు వెళ్తున్నామని తెలిపారు. భోజనంలో పురుగులు, వంట సామగ్రిలో తుట్టెలు కట్టాయని తెలిపారు. వంట చేసే వారు సాయంత్రం 4 గంటలకే రాత్రి భోజనం వండి ఇంటికి వెళ్లిపోతున్నారని, ఆ తర్వాత రాత్రి 8 గంటలకు నైట్ వాచ్‌మన్ వస్తున్నారని తెలిపారు. అప్పటి వరకు తాము బిక్కుబిక్కుమంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హాస్టల్‌లో వంద మంది విద్యార్థినులు ఉండాల్సి ఉండగా నిర్వాహకుల పనితీరు సరిగా లేకపోవడంతో ప్రస్తుతం 40 మందే ఉన్నారు. బుధవారం తహసీల్దార్ వివేక్ హాస్టల్‌ను సందర్శించి నిర్వాహకులను తొలగిస్తున్నట్లు తెలిపారు. అయితే గురువారం మళ్లీ వారే వచ్చి నాణ్యతలేని అల్పాహారం వండినట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. కలెక్టర్ తమ హాస్టల్‌కు వచ్చి సమస్యలను పరిష్కరించాలని లిఖితపూర్వకంగా విద్యార్థినులు కోరడం గమనార్హం. ఇప్పటికైనా హాస్టల్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

- నాణ్యత లేని ఆహారం.. నాసిరకం సరుకులు
- నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు
- తనిఖీలు మరచిన అధికారులు



ములుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నెలలో ఒకవారం, వారంలో ఒకరోజు కుటుంబంతో కలిసి మంచి భోజనం చేయాలంటే హోటల్‌కో, రెస్టారెంట్‌కో వెళ్తాం. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు నాణ్యత లేని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను అందిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.. ఆహార నాణ్యతను పరీక్షిం చాల్సిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని తెలుస్తోంది. ములుగు జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్‌సెంటర్లపై అధికారుల తనిఖీలు కరువయ్యాయి. నిర్వాహకులు నిబంధనలు తుంగలో తొక్కుతూ నాణ్యత లేని తినుబండారాలను వినియోగదారులకు అంటగడుతూ ప్రజా రోగ్యంతో చెలగాటమాడుతున్నారు. నాసిరకం సరుకులు, కల్తీ నూ నెతో చేసిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. ఒక సారి విని యో గించిన వంట నూనెను మళ్లీ వాడకూడదనే నిబంధన ఉన్నప్పటికీ పలు హోటల్స్, రెస్టా రెంట్ల యజమానులు అవి పాటించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాణ్యత లేని ఆహారం.. నాసిరకం సరుకులు

ములుగు జిల్లాలోని పలు హోటల్ నిర్వాహకులు నాసిరకం సరుకులతో నాణ్యత లేని వంటకాలు చేసి వినియోగదారుల ఆరోగ్యాలతో చెలగాటమా డుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీ ఆహార పదార్థాలు వినియోగదారులకు వడ్డించడంతోపాటు పరిశుభ్రత పాటించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ ధరకు వస్తుందని చచ్చి పోయిన కోళ్లు, మేకల మాంసంతో చేసిన వంటకాలను చేసి వినియోగదారులకు అందిస్తూ యజమానులు సొమ్ము చేసుకుంటున్నారని పలువురు అంటున్నారు. హోటల్ గదుల్లో ఎలుకలు, బొద్దింకలు తిరు గుతున్నాయని పలువురు చెబుతున్నారు. వంట గదవుల్లో మురికి పేరు కుపోవడం, మురు గునీరు నిల్వ ఉండడం, ఈగలు, దోమలు, ఇతర కీటకాలు ఆవాసముంటున్నాయి. అవి వాలిన ఆహార పదార్థాలు తిన్న ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. నిత్యం తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహ రిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వడ్డించే వారు సైతం గ్లౌజ్‌లు, మాస్కులు, డ్రెస్ కోడ్ తదితర నిబంధనలు పాటించడం లేదు.

నిబంధనలకు నీళ్లు

పలు హోటల్, రెస్టారెంట్, ఫాస్ట్ ఫుడ్, బేకరీ నిర్వాహకులు ఆహార భద్రత నియమాలను తుంగలో తొక్కుతున్నారు. ఏ రోజున కొనుగోలు చేసిన ఆహార పదార్థాలను అదేరోజు వండి పెట్టాల్సి ఉన్నప్పటికీ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతు న్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకసారి వినియోగించిన నూనెను మళ్లీ వినియోగించి వంటలు చేసి అవి వినియోగ దారులకు వడ్డిస్తున్నట్లు తెలుస్తోంది. వంట గదులు, వినియోగదారులు కూర్చునే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచాల్సి ఉండగా పలు హోటల్స్, రెస్టారెంట్స్, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రత కొరవడిందని తెలుస్తోంది. ఆహార పదార్థాలు, మాసం మిగిలితే వాటిని వెంటనే పడేయకుండా వాడుతున్నారని సమాచారం. పలు హోటల్ నిర్వాహకులు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు పొందకుండానే నడిపిస్తున్నారని తెలిసింది.

కొరవడుతున్న పర్యవేక్షణ

ములుగు జిల్లాలో ఆహార తనిఖీలు చేసే వారు కరువయ్యారని, హోటల్స్, రెస్టారెంట్స్, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లలో ఎప్పటికప్పుడూ తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు తనిఖీలు చేపట్టడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏటూరునాగారం, మంగ పేట, గోవిందరావుపేట, వెంకటాపూర్, జేడీ మల్లంపల్లి ములుగు తదితర మండల కేంద్రాల్లో రోడ్లపైనే టిఫిన్ సెంటర్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నడిపి స్తున్నారు. వాటిపై దుమ్ము, ధూళి పడుతున్నా నిర్వాహకులు ఎలాంటి రక్షణ చేపట్టకుండా అమ్మకాలు జరుపుతున్నారు. అయినప్పటికీ అధి కారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మామూ లుగా వ్యవహ రిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తరుచూ హోటల్స్, రెస్టా రెంట్స్, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తనిఖీలు కరువయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నట్టా... లేనట్టా?

ములుగు జిల్లాకు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నట్టా.. లేనట్టా.. అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. జిల్లాకు ఎక్కువ శాతం అధికారులు ఇన్‌చార్జిలు ఈ విషయమై ఫుడ్ సేఫ్టీ అధికారిని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

గ్రంథాలయాలు.. ప్రగతికి నిలయాలు: రవిచందర్



ప్రతిభ చాటిన విద్యార్థినులతో బానోత్ రవి చందర్

ములుగు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ప్రగతికి నిలయాలు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జిల్లా గ్రంథాలయ ఆవరణలో గ్రంథాలయ పాలకురాలు బి. సమ్మక్క ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, కవి సమ్మేళనం వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. గ్రంథాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్ నిఖిల్, రాకేష్, సిబ్బంది దూడబోయిన సురేష్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు

వాజేడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంతోపాటు నాగారం జడ్పీహెచ్‌ఎస్‌లలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ కడారి సుమన్, చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్‌వర్కర్ చంటి, ప్రధానోపాధ్యాయుడు సోయం ఆనందరావులు మాట్లాడారు. బాలలు తమ హక్కులకు భంగం వాటిల్లితే 1098కి సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాలు జరిగినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పోరిక స్వరూప్‌సింగ్, చల్లగురుగుల మల్లయ్య, తెల్లం రాజ్యలక్ష్మి, బొగ్గం కుమార్‌బాబు, కోకిల శ్రీరంగం, జర్పుల వాస్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి : డీఎంహెచ్‌వో



ఆస్పత్రి రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

మంగపేట నవంబరు 20(ఆంధ్రజ్యోతి) మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సహాయం అందించాలని ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు స్టాకు రిజిస్టర్ల నివేదికలను పరిశీలించా రు. అనంతరం మంగపేట ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మండలంలోని చుంచుపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎన్‌సీడీ సిబ్బందికి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పవన్ కుమార్ ఎన్‌సిడి స్క్రీనింగ్ శిక్షణను అందించారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని వైద్యులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎన్‌పీ ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, మంగపేట, చుంచుపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు స్వప్నిత, యమున, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి స్థాయి షెడ్యూల్‌ను సిద్ధం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను పూర్తి స్థాయిలో అధికారులు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ శ్రీజనతో కలిసి ఆమె గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, పంచా యతీరాజ్ శాఖ జిల్లా అధికారి శ్రీలతతో ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుముదిని మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలపే ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులే కుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహిం చనున్న నేపథ్యంలో అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమ ర్పించాలని తెలిపారు. 2011 ఎన్నికల జాబితా ప్రాతిపదికన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగలు, 2024 ఎస్‌త్రిపుల్‌ఈపీసీ సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

అనంతరం అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ సమావేశమయ్యారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఎన్నికల షెడ్యూల్ సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ జిల్లా అధికారి శ్రీలతను ఆదేశించారు. అలాగే మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్న క్రమంలో దానికి సంబంధించిన నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలు, సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయ లక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఆర్‌డీవో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పైరవీలకే పరిమితమవుతున్న ఆ సంఘాలు

ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీపై సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నరసింహారావు ఫైర్



విలేకరులతో మాట్లాడుతున్న నరసింహారావు

కృష్ణకాలనీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ ప్రభుత్వాల చెంతన చేరి పైరవీలకే పరిమితం అవుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు మండిపడ్డారు. భూపాలపల్లిలో గురువారంఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరిం చడంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఏ మాత్రం పట్టిం చుకోవడం లేదని ఆరోపించారు. కారుణ్య నియామకాలు చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. బంగారంలాంటి సింగరేణిని నిర్వీర్యం చేస్తున్నా రని ధ్వజమెత్తారు. సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చ కుండా మళ్లీ వెయ్యి ఇళ్లను నిర్మిస్తామని చెప్పడం సరికాదన్నారు. బొగ్గు బావుల ప్రవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బొగ్గు బావుల ప్రవేటీకరణ ద్వారా సింగరేణి సంస్థకు తీరని నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఇప్పటికైనా అన్ని సంఘాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని, కార్మికుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పనిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో భూపాలపల్లి బ్రాంచి కార్యదర్శి కంపెట రాజయ్య, బ్రాంచి కమిటీ సభ్యులు తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అడిషనల్ కలెక్టర్ తనిఖీ

కాటారం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలో పరిసరాలను, మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పనితీరును, సమస్యలను విద్యార్థులను అడిగి తెలసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, కేజీబీవీ ఎస్‌వో సునిత, పంచాయతీ కార్యదర్శి సమీర్ ఖాన్ తదితరులు ఉన్నారు.

మహిళకు ఎల్‌వోసీ అందజేత

కాటారం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన బొమ్మ సంధ్యకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.4లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. సంధ్య అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యఖర్చుల నిమిత్తం సాయం అందించాలని మాజీ సర్పంచ్ వేమునూరి రమేష్‌రెడ్డితో కలిసి మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.4 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించగా ఆయన వ్యక్తిగత సహాయకుడు గురువారం బాధితురాలి కుటుంబ సభ్యులకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మల్హర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల, పెద్దతూండ్ల, అడ్వాలపల్లి గ్రామాల్లో గురువారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను చైర్మన్ ఇప్ప మొండయ్య ప్రారంభించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దకు రైతు పండించిన పంటను తరలించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, వైస్ చైర్మెన్ సూర్య ప్రకాశ్‌రావు, డైరెక్టర్ వొన్న తిరుపతిరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల ఓదెలు, నాయకులు రాజునాయక్, చంద్రయ్య, కిషన్ నాయక్, వెంకటస్వామి, మండల రాహుల్, సతీష్, శ్రీనివాస్, సదయ్య, మధుకర్, ఏఈవోలు పృథ్వీ, శిరీష, రైతులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

మంగపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) ఉన్నత చదువులతోనే యువతకు బంగారు భవిత ఉంటుందని జ్వాలా ట్రస్ట్ గౌరవ సలహాదారుడు కోలగట్ల నరేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కమలాపురం జడ్పీ పాఠశాల విద్యార్థులకు గురువారం కొండాపూర్ పాఠశాలకు సమకూర్చిన స్పోర్ట్స్ యూనిఫామ్‌ను జ్వాలా యూత్ ఆధ్వర్యంలో ఆయన అందజేశారు. ప్రతిభ కలిగి ఉన్నత చదువులు చదువుకోవాలనుకునే పేద విద్యార్థులకు జ్వాలా యూత్ అండగా నిలుస్తుందని అన్నారు. 2025- 26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మండల టాపర్‌గా నిలిచే విద్యార్థికి జ్వాలా యూత్ తరఫున రూ. 10,116 బహూకరిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో కమలాపురం జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యా యుడు గడ్డి శ్రీనివాస్, జ్వాలా ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్, మీడియా ఇన్‌చార్జి సమ్మారావు, ఉపాధ్యాయులు ప్రసాద్, నాగలక్ష్మి, నాగమ్మ, నరేష్, రమేష్, రాజేశ్వర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు వర్మీ కంపోస్ట్ పరికరాల అందజేత

ములుగు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గన్నపేట గ్రామ పరిధిలోని పులిగుండంలో వర్మీ కంపోస్ట్ పరికరాలు, ఆర్గానిక్ మందులను గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి నూనేటి శ్యామ్ యాదవ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పంటలపై రసాయనిక ఎరువులు వాడకాన్ని పూర్తిగా తగ్గించి ఆర్గానిక్ మందులను వాడాలని అన్నారు. రైతులకు వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని వివరించి, వాటి పరికరాలను, 100 కేజీల ఆర్గానిక్ పెస్టిసైడ్స్‌ను రైతులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ముత్తినేని సదానందం, కన్నెబోయిన కుమార్, కొడారి శ్రీకాంత్, శ్రీను, రాజు, రమేష్, ప్రైవేట్ కంపెనీ కోఆర్డినేటర్ మనోహర్, రైతులు పాల్గొన్నారు.

అగ్రిమెంట్ లేకుండా మొక్కజొన్న సాగు చేయొద్దు

కన్నాయిగూడెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విత్తన కంపెనీలతో అగ్రిమెంట్ బాండ్ లేకుండా విత్తనోత్పత్తి మొక్కజొన్నను రైతులు ఎవరూ సాగు చేయకూడదని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ అన్నారు. గురువారం ఆయన బాండు మొక్కజొన్న సాగు చేస్తున్న రైతుల పొలాల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కంతనపల్లి, ముప్పనపల్లి తదితర గ్రామాల్లో బాండ్ మొక్కజొన్న పంటను రైతులతో పండించేందుకు కొన్ని కంపెనీల ఏజెంట్లు మండలంలో తిరుగుతున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. గత సంవత్సరం ఇలాగే బాండ్ మొక్కజొన్న సాగు చేయగా పంట దిగుబడులు రాక పోవడంతో రైతులకు కంపెనీల నుంచి నష్టపరిహారం రాగా అవి కొంతమంది ఏజెంట్లు రైతులకు అందచేయలేదని గుర్తు చేశారు. కంపెనీ ఏజెంట్స్ రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వనదేవతలకు ఎంపీడీవో మొక్కులు

తాడ్వాయి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మేడారం వనదేవతలు సమ్మక్క- సారలమ్మను ఎంపీడీవో తేజ గురువారం దర్శించుకున్నారు. ముందుగా తల్లుల గద్దెలకు పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె, సారె కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనతో పాటుగా పంచాయతీరాజ్ అధికారులు, స్థానిక కార్యదర్శి సతీష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మేడారంలో ఆదివాసీ కళా బృందం

మండలంలోని మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఆదివాసి గోండు కళా బృందం మంగళవారం తరలివచ్చి మేడారంలో పర్యటించారు. అనంతరం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆదివాసి మ్యూజియం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోండు కళాకారులకు అవకాశాలు కల్పించాలని మంత్రి సీతక్కను కలవడానికి వచ్చామని తెలిపారు. ఈ క్రమంలో మేడారంలో పర్యటించి ఆదివాసి ఇలవేల్పులను దర్శించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ గ్రామ కమిటీ అధ్యక్షుడు గడిగ సునీల్, ఆలం అర్జున్, మూజియం క్యూరేటర్ కురుసం రవి, మ్యూజియం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో మెరుగైన ఉపాధి



తేనెటీగలు ఉన్న బాక్స్‌ను చూపుతున్న పంతకాని తిరుమల

కాటారం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి అనుబంధంగా తేనెటీగల పెంపకం సాగిస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీహెచ్‌ఎం) అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోతి అన్నారు. కాటారం ఏఎంసీ కార్యాలయంలో ఎన్‌బీబీ (నేషనల్ బీ బోర్డ్) సహకారంతో ఎన్‌ఐపీహెచ్‌ఎం ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై వారం రోజుల పాటు జరిగే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపుతో కలిసి ఏఎంసీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుమల, జ్యోతి మాట్లాడుతూ తేనెటీగల పెంపకం, తేనెసేకరణ, విక్రయాలతో ఉపాధి లభిస్తుందన్నారు. తేనెటీగల పెంపకం చేయడానికి శిక్షణ తీసుకునేవారికి ప్రభుత్వం ఎన్‌బీబీ ద్వారా సబ్సిడీ సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఈ శిక్షణ తరగతులకు 25 మంది హాజరయ్యారు. మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, రైతులు పోచిరెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, మధు, అశోక్, కుమార్, రాజేంద్రప్రసాద్, నర్సింహారెడ్డి, ఏఎంసీ సిబ్బంది మల్లికార్జున్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీవోగా మహేందర్

మంగపేట నవంబరు20 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ అధికారి (ఎంపీవో)గా జి.మహేందర్ గురువారం విధుల్లో చేరారు. ఈ మేరకు ఎంపీడీవో భద్రు ఒక ప్రకటనలో తెలిపారు. మంగపేట మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న పి.శ్రీనివాస్ డిప్యూటేషన్‌పై తాడ్వాయి మండల పంచాయతీ అధికారిగా వెళ్లడంతో అతడి స్థానంలో తాడ్వాయి మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న జి. మహేందర్ డిప్యూటేషన్‌పై మంగపేట మండల నూతన పంచాయతీ అధికారిగా గురువారం విధుల్లో చేరినట్లు ఎంపీడీవో వెల్లడించారు.

'మోడికుంట'కు మోక్షం

(5వ పేజీ తరువాయి)

భూములు అప్పగించాల్సి ఉండటంతో ప్రాజెక్టు పనులు మొదలు కాలేదు. దీంతో పనులను చేపట్టేందుకు తెచ్చిన యంత్రాలు నిర్మాణ ప్రదేశంలోనే తుప్పుపట్టిపోతున్నాయి.

సర్వే పనులు ప్రారంభం

మోడికుంట ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో మంత్రి వర్గంలో నిర్ణయం తీసుకొని ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని ఆదే శాలు జారీ చేసింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం రావాల్సిన అన్ని అనుమతులూ రావడంతో పనులు ప్రారం భించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఈ క్రమం లోనే ప్రాజెక్టు నిర్మాణం కోసం నిర్వహించిన టెండర్లలో ఎస్‌ఆర్‌సీ ఇన్‌ఫ్రా కంపెనీ టెండరు దక్కించుకుంది. ప్రస్తుతం ఆ కంపెనీ ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశంలో సర్వే పనులు ప్రారంభించింది. గతంలో టెండరు దక్కించుకున్న గామన్ ఇండియా కంపెనీ తప్పుకోవడంతో ఎస్‌ఆర్‌సీ ఇన్‌ఫ్రా కంపెనీకి ఈ అవకాశం దక్కింది. ఈ క్రమంలో పూర్తి స్థాయి సర్వే అనంతరం రెండు నెలల్లో ప్రాజెక్టు పనులు ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నామని, పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

రూ 718 కోట్లకు చేరుకున్న వ్యయం

మోడికుంట ప్రాజెక్టు నిర్మాణం కోసం 2005లో రూ.124.60 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గామన్ ఇండియా కంపెనీ ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో రూ 118.95 కోట్లకు ప్రాజెక్టు పనులను దక్కించుకుంది. పనులు మొదలు కాకుండానే సర్వే కోసం రూ 1.30 కోట్లు, మొబిలైజేషన్ అడ్వాన్సులకు రూ 5.94 కోట్లు, భూ సేకరణకు రూ 96.50 లక్షలు, అటవీ శాఖ అనుమతులకు రూ 62 కోట్లతో మొత్తం 70.20 కోట్లను ఖర్చు చేశారు. ఈ క్రమంలో ప్రాజెక్టు అంచానా వ్యయం అంతకు అంతకు పెరుగుతూ 2025 నాటికి రూ.718.60 కోట్లకు చేరుకుంది.

వేల ఎకరాలకు సాగునీరు

రాష్ట్రంలో ముంపు గురికాకుండా నిర్మాణం జరిగే ప్రాజెక్టు మోడికుంట మాత్రమేనని నిపుణులు అంటున్నారు. దీని నిర్మాణంతో వాజేడు మండలంలోని వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది. ప్రాజెక్టును 2.142 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో ఖరీఫ్‌లో 13,591 ఎకరాలు, రబీలో 6,796 ఎకరాలకు నీరు అందనుంది. ప్రధాన కాల్వ పొడవు 21.85 కిలోమీటర్లు ఉండటంతో మండలంలో నలు మూలకు ఈ ప్రాజెక్టు నీటితో పంటలు తడవనున్నాయి. అదే విధంగా తాగునీటి కోసం 0.12 టీఎంసీలను కేటాయించారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగితే భూగర్భ జలాలు సైతం పెరుగుతాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు

(5వ పేజీ తరువాయి)

విసిరారు. రహస్యంగా ఇళ్ల పట్టాలు ఇవ్వడం సిగ్గు చేటని, గతంలో తామ మునిసిపల్ కార్యాలయంలో నోటీసు బోర్డుపై జాబితాను అంటించి ప్రజల అభిప్రా యాలను తీసుకొన్న తర్వాతే ఇళ్లను కేటాయించామని గుర్తు చేశారు. అర్హులైన లబ్ధిదా రులు ఆందోళన చేస్తే వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. ఇళ్ల కేటాయింపులో జరిగిన తప్పిదాల్లో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, హౌసింగ్ పీడీ, ఎమ్మెల్యే, మునిసిపల్ కమిషనర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజలను ఇబ్బం దులకు గురిచేసే చర్యలను ఇకనైనా మానుకోవాలని ఆయన హితవుపలికారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు నూనె రాజు, ముంజంపల్లి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధులు దొరికాయని జోరుగా ప్రచారం

మంగపేట నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : గుప్త నిధుల తవ్వకాలు జరిగాయంటూ మండలంలో జోరుగా సాగుతున్న ప్రచారం తీవ్ర చర్చనీయాంశమైంది. మండలానికి చెందిన కొందరు మహారాష్ట్రకు వెళ్లి అక్కడ తవ్వకాలు జరిపి రూ.కోట్ల విలువ చేసే బంగారాన్ని తీసుకొ చ్చారని, ఈ విషయం పోలీసులకు తెలిసిందని, దీంతో ఎస్పీ రంగంలోకి దిగి విచారణ చేపట్టారని కొన్ని సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ఆ వ్యక్తులు భారీగా తీసుకొచ్చిన బంగారాన్ని ఏటూరునాగారం మండలంలోని ఓ గ్రామంలో పాతిపె ట్టారని, వాటాలు వేసుకుని పంచుకునే క్రమంలో వచ్చిన విభేదాల మూలంగానే ఈ తవ్వ కాల విషయం బయటకు పొక్కిందని చర్చ సాగుతోంది. ఈ విషయమై మంగపేట ఎస్సై టీవీఆర్ సూరిని వివరణ కోరగా తవ్వకాల విషయంలో జోరుగా సాగుతున్న ప్రచారంపై విచారణ చేస్తున్నామని అన్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలను తెలియజేస్తామని వెల్లడించారు.